# మాష్టరీ

వలూరి కృష్ణారావు

ఏ తండ్రీ తన చిట్టిబాబు మాష్టరీ చెయ్యాలని కలలో కూడా అనుకోడు. ఏ చిట్టి బాబూ తాను మాష్టరీ చేస్తున్నట్టు కల కూడా కనడు. అథవా ఒక కల వస్తే అది పీడకలగా భావించేవారు లేకుండా వుండరు. మాష్టరీ అంటే ఇంత విముఖత, ఏహ్యామునకు గల కారణాలు ఊహిస్తే కొన్ని సబబయినవిగాను కొన్ని అనిర్వచనీయమైనవిగానూ తోస్తాయి.

మాష్టరీ అంటే తెలియనివాడు అసలు ఉండడనేది ఘోరమైన నిజం. కొన్ని ఉద్యోగాలు ఏ కొద్దిమందికో తెలియకుండా ఉంటాయి. ఆ మధ్య ఒక గ్రామ మోతుబరి 'విలేజి లెవిల్ వర్కర్' అంటె ఏమిటంటే ఇంకో చిన్న యెత్తు గ్రామ రాజకీయవేత్త 'గ్రామ సమమట్టకుడు' అని దాని కర్థం చెప్పి గ్రామంలోని రోడ్లు సరిగా ఉన్నయో లేవో చూసే ఉద్యోగి అని చెప్పి ఊరుకున్నాడు. ఏ ఉద్యోగం గురించీ మాష్టరీ ఉద్యోగం తెలిసినంతగా ఎవ్వడికీ తెలియదు. ఏ పాలెంలోనైనా సరే బడిపంతులుంటాడు. దూరపు కొండలు నునుపు. తెలియనిది వింత. అందుచేత అందరికీ తెలిసిన ఉద్యోగం...ఎంత పుణ్యము పురుషార్థము తెచ్చేది అయినప్పటికీ మనస్కరించదు.

మాష్టరీకి పైమెరుగులు లేవు. నిరాడంబరంగా, సాదాగా, మామూలు మనం ఉన్నట్టుగానే బడి పంతులుంటాడు. వీడికో జవానుగాని...అల్లాటి వేమీ లేవు. పంతులు పూర్తిపేరు సాధారణంగా పంతులే. తల్లీ తండ్రీ పెట్టిన పేరు పూర్తిగా పోయి, ఏ పెసరపప్పు మాష్టరో, ఏ కందిపప్పు మాష్టరనో వ్యవహరింప బడతాడు. ఏ ఉద్యోగీ మాష్టరు తన ఉద్యోగంలో లీనమయి పోయినంతగా లీనమైపోడు. అసలు ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. ఉద్యోగ దృష్ట్యా మాష్టరు ఈ సామెతకు వ్యతిరేకం. ఇంటిని ఎంత కళగా ఉంచాలన్నా అది అతనికి సాధ్యం కాదు. మిగతా ఉద్యోగుల్లాగా అతను స్కూలునుంచి ఉల్లాసంగా రాలేడు. ఏ పంతుల భార్యా, మిగతా ఉద్యోగస్తుల భార్యల్లాగ జేబులు తడమదు. ఏ పెట్టెకల్లో తెలియక పంతులు జేబులు చూస్తే అరిగిపోయిన సుద్దముక్కలు పాపం!"

వీధిలో వాళ్ళు పంతులుకిచ్చే గౌరవంమాట ఎల్లా ఉన్నా, పంతుల సదా తనకుతాను అగౌరవ పర్చుకుంటాడు. తనది వెధవ ఉద్యోగం అని అనుక్షణమూ జ్ఞాపకం చేసుకుంటాడు! తన్ను తాను గౌరవించుకోపోతే వీధిలో వాళ్ళుకూడా గౌరవించలేరూ అన్న సంగతి తెలిసికూడా తెలియనట్లు ఊరుకొంటాడు. ఏదో ఒక 'వీక్ సెన్స్' ఎప్పుడూ తన్ను వెంటాడుతుంది. అందుకే సాధ్యమయినంత వరకు పెద్దలకు దూరంగానే ఉంటాడు. కాని చిత్రం. పిల్లకాయలపట్ల నిరంకుశుడుగా ఉండే తను, వీధిలోని సాదా మనిషిని చూచినా తాను పంతుల్ని చూచి బెదిరిపోయే కుఱ్ఱాడైపోతాడు.

పంతులుద్యోగమంటే కొందరికి అహితవు అది పంతులుద్యోగం కనకనే! అదే చెప్పాను. వెధవ ఉద్యోగం అంటారు. ఎవళ్ళో అనడమెందుకు... తనదగ్గర చదివి, చదువు పూర్తి చేసుకొని... "మాష్టారు ట్రయినింగ్‌కు వెడ్తానండీ అని ఓబుద్ధిమంతుడంటే "వద్దునాయనా" అంటాడు. మరి మీరెందుకు చేరారు అంటే దానికి సమాధానం చెప్పుతాడు ఏమంటే...ఏం చెయ్యమంటావ్... గత్యంతరంలేక. ఏమాత్రం తన గతికి కాస్త మరి ఒక త్రోవ ఉన్నా ఈ ఉద్యోగం ఎప్పుడూ తీసుకోడు. అదిలేక ఈ ఉద్యోగం ... చిట్టచివర ప్రయత్నంమీద తీసుకుంటాడు. ఆఖరి రాయికి తగిలి క్రిందపడిన ఫలం ఈ ఉద్యోగం.

మాష్టరు నిరాశవాదిగాచేరి నిరాశవాదిగానే చనిపోతాడు. పాపం! అన్ని ఆశలూ పోయాక ఈ ఉద్యోగంకోసం ప్రయత్నిస్తాడు శిక్షణ పొంది. శిక్షణకాలం ప్రారంభించిన దగ్గరనుంచే మాష్టరుకు

పిరికిమందు పోస్తారు. క్షమను గురించి పాఠాలు చెపుతారు. మీ ఉద్యోగం పువ్వులపరుపు కాదు ముళ్ళపరుపు. మీ బ్రతుకులు లేత అరిటాకు. జాగ్రత్త. క్షమ మీ హాబీగా అలవర్చుకోవాలి... ఇంకా ఇంకా...

మాష్టరుకు తన రేపటి జీవితానికి 'సెక్యూరిటీ' లేదు. అలా సెక్యూరిటీ లేకుండా పుట్టి, బ్రతుకుతూ, చావాల్సిందే! ఏనాటి పాపమో మరి. బడిపంతులు ఇంత హీనంగా బ్రతకవలసి వస్తే!

అసలు కంచే చేను మేస్తోంది మాష్టరు పట్ల! విద్యాశాఖా అన్ని శాఖల్లోనూ ఉత్తమమైంది. ఏ మాత్రం అశ్రద్ధ, అలక్ష్యము చూపినా మొత్తం దేశం అంతా అధోగతి పాలుకావలిసిందే! ఏ సిబ్బందినైనాసరే, ఈశాఖనుంచి పెరిగి పెద్దవారు కావాలిసిందే! ఏ మాంత్రికుని దండంవల్లాకూడా ఆ సిబ్బంది తయారు కాలేదు. మాష్టరు పై అధికారులు కూడ మాష్టరు క్రిందనుంచి వచ్చినవారే! ఇంత మహోత్కృష్టమైన శాఖ ఇది. కాని... ఈ శాఖఅన్ని శాఖల్లోనూ 'వీకెస్టులింక్'అయిపోయింది. ఈ శాఖలోని ఉద్యోగులంతా నిరాశగా బ్రతుకుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వపు చిన్నచూపు. అతిముఖ్యమైన ఈ శాఖను ప్రభుత్వం ఏవిధంగానూ ప్రోత్సహించుటలేదు. పైగా మామూలుగా మిగతా అన్నిశాఖల ఉద్యోగుల కిచ్చే పెన్షన్ వగైరా సౌకర్యాలు కలిగించక పోవడం. అంతెందుకు— ఈ శాఖలోని ప్రభుత్వపు బడిపంతుళ్ళకు లోకల్ బోర్డు బడి పంతుళ్ళకు ఎంతో తేడాఉంది. సౌకర్యాల దృష్ట్యా—జీతాలలో కూడా తేడాయే! ప్రభుత్వపు స్కేల్సు మామూలు ఈ స్థానిక సంస్థలు ఇవ్వడంలేదు—స్థానిక సంస్థల పాఠశాలలకంటే కమిటీ పాఠశాలలే ఎన్నోరెట్లు 'నయం' అనిపించుకుంటున్నాయి—

బడిపంతుళ్ళకు ప్రభుత్వం కనీస వేతనాలు కనీస సౌకర్యాలు అందచేయక పోవడం పోగా... బడిపంతుళ్ళపై విరుచుకుపడుతోంది. రోజు రోజు పెరిగిపోతున్న ఉద్యోగస్థుల ఎడ. అవినీతి, అక్రమాలను అణిచిపెట్టలేక పోతోందిగాని. ఏ పంతులో జీతంచాలక, కుటుంబ భారాన్ని ఎలాగో వహిద్దామని తలచి తనకు తీరకపోయినా, విధిలేక కక్కుర్తి పడి ఏ రెండు ప్రయివేట్లో చెప్పుకుందామంటే దానిపై 'నిఘా' బనాయించింది... పైగా ఈనాడు విద్యాప్రమాణం పడిపోవడానికి పూర్తిగా మాష్టర్లే బాధ్యులంటోంది. ఈ విద్యాప్రమాణం పడిపోవడానికి గల కారణాల కొల్లలు అవి వేరే ముచ్చటించుకోవచ్చును!

మాష్టరీ అంటే ఎంతో హితవుకలగజేయవచ్చు ప్రభుత్వం తలుచుకొంటే. అది ఎప్పుడూ జరగని పని. ప్రభుత్వానికి తెలుసు మాష్టరు మూలన పడి ఉన్న ముసలిముండ. తన కష్టాలను తాను చెప్పుకోడానికికూడా నోరులేదు. మాష్టరుకు—ఎదురు తిరిగే ధైర్యంలేదు.—ఇదేమీ రైల్వేశాఖకాదు. సమ్మెలుచేస్తే ప్రభుత్వం హడలి పోవడానికి. అందుకే ప్రభుత్వం ఈ శాఖపై ఉదాసీనత చూపుతున్నది.

ఏమైనా అది మంచితనం కాదు. భావిపౌరులను రూపురేఖలుదిద్దే నిపుణులు నిరాశగా, చాలీచాలని జీతాలతో, సమాజంలో నికృష్టంగా బ్రతకరాదు. ప్రభుత్వము తలుచుకుంటే అది ఏమంత కష్టం కాదేమో!

---

పూర్వం ఇటలీ దేశంలో తెలివి తేటలకు ప్రసిద్ధిచెందిన ఆల్బియన్ అనే రాజు, మందబుద్ధి అని పేరు తెచ్చుకున్న బెర్టోల్డో అనేవాడికి ఉరిశిక్ష వేశాడు. వాడు ఆఖరి కోరిక కోరుకుంటూ, "మహారాజా! నన్ను చెట్టుకి వేలాడిదీసి ఉరి తీస్తారు గద! ఆ చెట్టు నన్ను ఎంచుకోనివ్వండి. నాకు నచ్చిన చెట్టు వెతుక్కుంటాను!" అన్నాడు. వాడి కోరికను రాజుగారు మంజూరు చేశారు. ఆ తరవాత వాడు రాజుగారి ఖర్చుమీద దేశమంతా యిరవై సంవత్సరాలు గాలించి తిరిగినా, వాడు బతికున్నన్నాళ్ళూ వాడికి నచ్చిన చెట్టే కనబడలేదు.